క్లుప్తంగా

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



తాళ్లపూడి పోలీస్ స్టేషన్ వద్ద ప్రేమజంట బొంతు అనిల్, గూడా ధరణి

తాళ్లపూడి: మేజర్లు అయిన ఓ ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించి తమకు రక్షణ కల్పించాలని కోరింది. మండలంలోని అన్నదేవరపేట గ్రామంలోని ఒకే సామాజిక వర్గానికి చెందిన బొంతు అనిల్, గూడా ధరణి అనే యువతీ యువకుడు తాళ్లపూడి పోలీసులను ఆశ్రయించారు. తాము వివాహం చేసుకున్నామని తమకు రక్షణ కల్పించాలని తాళ్లపూడి ఎస్సై వెంకటరమణను కోరినట్టు ఆయన తెలిపారు.

11,283 సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ

చాగల్లు: ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ఎంఈవో వి.ఖాదర్‌బాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు.ఆయన మాట్లాడుతూ 1 వతరగతి నుండి 9వ తరగతి వరకూ మొత్తం 11,283 సెమిస్టర్-2 పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యకు తొలి ప్రాధాన్యం ఇచ్చి విద్యార్థులకు కావలసిన పాఠ్య పుస్తకాలు ముందుస్తుగానే పంపిణీ చేస్తోందన్నారు.

రేషన్‌కార్డుల అందజేత



లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలోని నాలుగో వార్డులో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, సచివాలయ కన్వీనర్ గుర్రాల నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు గంగుల గోపీ యాదవ్, పెద్ది రత్నకుమారి, యారగొల్ల సత్తిబాబు, కడియపు దమయంతి, నోముల భవాని కట్టా నాగలక్ష్మి, తోట సత్యశ్రీ , సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి

చాగల్లు: వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం. సౌజన్య అన్నారు. ఆ పీహెచ్‌సీలో శుక్రవారం రోగులకు ఆమె అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తాగునీరు కలుషితం కావడం వలన డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. అందుచేత కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగటానికి వినియోగించాలన్నారు. వేడి పదార్థాలను తినాలని, ఈగలు వాలిన, నిల్వ ఉంచిన పదార్థాలను తినకూడదన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉండకూడా చూసుకోవాలన్నారు.

ఆగస్టు 1 నుంచి ఫార్మేటివ్-1 పరీక్షలు

నల్లజర్ల: ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఆగస్టు-1 నుంచి ఫార్మేటివ్-1 పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ-1 వై.సత్యనారాయణ తెలిపారు. ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరొకటి చొప్పున రోజుకు రెండు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు క్లాస్ రూం బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో ఓఎంఆర్ షీట్‌లలో పరీక్షలు జరుగుతాయన్నారు. 9,10 తరగతుల విద్యార్థులు జవాబులను పత్రాలలో రాయాల్సి ఉంటుందన్నారు. మండల విద్యావనరుల కేంద్రానికి ఇప్పటికే సంబంధిత ప్రశ్నాపత్రాలు వచ్చాయన్నారు. పరీక్షల రోజు వాటిని ఆయా పాఠశాలలకు అందజేస్తామన్నారు.రాసిన జవాబు పత్రాలు సీల్ వేసి జిల్లా కేంద్రానికి పంపుతామని ఎంఈఓ-1 వై.సత్యనారాయణ తెలిపారు.

మద్దూరులో బాలిక అదృశ్యం

కొవ్వూరు: మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. గురువారం ఉదయం నుంచీ తన మనవరాలు కనిపించడం లేదంటూ ఆమె నానమ్మ కొవ్వూరు రూరల్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. గురువారం ఉదయం 11 గంటల సమయంలో తన మనవరాలు బ్యాగ్ సర్దుకుని వెళ్లిపోతున్నట్టు చుట్టు పక్కల వారి ద్వారా తెలుసుకున్నట్టు వృద్ధురాలు ఆ ఫిర్యాదులో పేర్కొంది. చుట్టు పక్కల వెతికినప్పటికీ యువతి ఆచూకీ లభ్యం కాకపోవడం ఆమె చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఉండ్రాజవరం: స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం రాత్రి లభ్యమైంది. ఆ వ్యక్తి మతిస్థిమితం లేకుండా గురువారం ఉదయం నుంచీ ఉండ్రాజవరం వీధుల్లో తిరిగినట్టు స్థానికులు తెలిపారని పోలీసులు చెప్పారు. మృతుడి వంటిపై జంధ్యంతో పాటు అతడు ధరించిన చొక్కాపై నిడదవోలుకు చెందిన ఆర్‌కే టైలర్ అనే లేబుల్ ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఉగ్ర గోదారి

- కొవ్వూరు డివిజన్‌లో 1,502 ఎకరాల వరి పైరు నీట మునక
- ముంపు బారిన 4 మండలాలకు చెందిన 181 ఎకరాల్లోని ఉద్యాన పంటలు
- మద్దూరు హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు
- 15 మత్స్యకార కుటుంబాల తరలింపునకు సన్నాహాలు

కొవ్వూరు: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. నదీ తీరం వెంబడి లంక భూములను ముంచెత్తుతోంది. కొవ్వూరు మండలం మద్దూరులంక సమీపంలో నదీ గర్భంలో నివాసం ఉంటున్న 15 మత్స్యకార కుటుంబాలకు చెందిన 42 మందికి పునరావాసం కల్పించేందుకు మద్దూరు హైస్కూల్లో గదులను సిద్ధం చేయించామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. మద్దూరులంకలోని గోదావరి వరద ఉధృతిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎగువన గోదావరికి వరద ఉధృతి మళ్లీ పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. అలాగే కొవ్వూరు పట్టణంలోని గోష్పాద క్షేత్రాన్ని ఆనుకుని వరద ప్రవహిస్తోంది. క్షేత్రంలోని రోడ్లపైకి అడుగు ఎత్తున వరద చేరింది. దాంతో ఈ క్షేత్రంలోకి జనం వెళ్లకుండా బారికేట్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ క్షేత్రంలో వరద తీరును పరిశీలించారు. డివిజన్‌లోని తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల్లోని గోదావరి స్నానఘట్టాల్లోకి ప్రజలు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ, నీటి పారుదల, అగ్నిమాపక శాఖల సమన్వయంతో అధికారులు గస్తీ ఏర్పాటు చేశారు. లంకల్లో ఉన్న పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని ఆర్డీవో వర్మ సూచించారు.

1,502 ఎకరాల్లో పంటలను ముంచెత్తిన వరద

భారీ వర్షాలు, గోదావరి వరదలకు డివిజన్‌లోని ఏడు మండలాల్లోని 28 గ్రామాల్లో వివిధ పంటలు ముంపు బారిన పడ్డాయి.1,502 ఎకరాల్లోని వరి పంట ముంపులో చిక్కుకున్నట్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మండలాలవారీగా కొవ్వూరులో 501 ఎకరాల్లోను, తాళ్లపూడిలో 471, గోపాలపురంలో 322, నల్లజర్లలో 87, దేవరపల్లిలో 72, చాగల్లులో 49 ఎకరాల్లోని పంటలు ముంపులో ఉన్నాయి. పెరవలి, కొవ్వూరు, నిడదవోలు, తాళ్లపూడి మండలాల్లో లంక భూముల్లో సాగు చేస్తున్న 181 ఎకరాల్లోని కూరగాయలు,అరటి తదితర పంటలు నీట మునిగాయి. గురువారం నుంచి వర్షం కాస్త నెమ్మదించడంతో ముంపు తీవ్రత నిలకడగా ఉందని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం వర్షం కురవకపోవడంతో రైతులు వరద నీటిని బయటకి పంపే ప్రయత్నాలు చేస్తున్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: మండలంలో శుక్రవారం గోదావరి వరద పెరగడంతో లంక భూముల్లోకి నీరు చేరుతోంది. తాడిపూడి ఎత్తిపోతల పథకం వద్ద, ప్రక్కిలంక ర్యాంపులో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరదకు లంక భూముల్లోని పల్లపు ప్రాంతాల్లోని పలు రకాల పంటలు ముంపు బారిన పడ్డాయి. వరద వేగేశ్వరపురం మేరీమాత ఆలయం మెట్ల వద్దకు చేరింది.తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురంలోని గోదావరి లంకల్లో సాగు చేస్తున్న కూరగాయలు, ఆకుకూరలు ముంపులో ఉన్నాయి. పంటలకు నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. నదిలో చేపల వేటకు వెళ్లే పడవలు ఒడ్డుకు చేరాయి.



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో షిర్డీ సాయి ఆలయాన్ని ముంచెత్తిన వరద



గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి వరద పరవళ్లు



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోకి ప్రజలను వెళ్ల నీయకుండా పోలీసుల కాపలా

ముంపులో ఎగువ లంకలు

పెరవలి: గోదావరి వరద ప్రభావంతో గురువారం సాయంత్రం వరకూ మండలంలోని దిగువ లంక భూములు మాత్రమే నీట మునిగాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి వరద వేగంగా పెరగడంతో పై లంకలు కూడా పూర్తిగా ముంపులో చిక్కుకున్నాయి. వరద తగ్గిపోతే పైలంకల్లో పంట నష్టం పెద్దగా ఉండదు. కానీ దిగువ లంకల్లో పంటలు పూర్తి పాడైపోతాయని రైతులు చెబుతున్నారు. ఊహించని రీతిలో గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో వ్యవసాయ ఉత్పత్తులను ఒబ్బిడి చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల వద్ద 4 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు.గోదావరి శాంతించినప్పటికీ మూడు రోజులుగా నీటిలో నానుతున్న పంటలన్నీ కుళ్లిపోతాయని రైతులు చెబుతున్నారు. ముంపులో చిక్కుకున్న పంటలకు ఒబ్బిడి చేసుకుందామనే ఉద్దేశంతో రైతులు ప్రాణాలకు తెగించి లంక భూముల్లోని అరటి, కూరగాయలు వంటి వివిధ ఉత్పత్తులను పడగల సాయంతో గట్టుపైకి తెస్తున్నారు.

పల్లెల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- గోపాలపురం మండల పరిషత్ సమావేశం

గోపాలపురం: మారుమూల గ్రామాలను కూడా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గోపాలపురం మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం తలపెట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వివిధ గ్రామాల్లో ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను ఇప్పటికే పరిష్కస్తున్నామన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వ్యక్తిగత సమస్యలను నూరు శాతం పరిష్కరించామన్నారు. ప్రజలు కోరిన ధ్రువ పత్రాలను జారీ చేయడం వల్ల అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గ్రామాల అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండల ఉపాధ్యక్షురాలు వంగా నారాయణమ్మ, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి, సర్పంచులు యండపల్లి శేఖర్‌బాబు, పఠాన్ అన్సర్ బాషా, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కుమ్మరకుంటలో వన మహోత్సవరం

గోపాలపురం: ప్రతి ఒక్కరూ తమ పరిధిలో మొక్కలు నాటి, వాటి పెంపకాన్ని చేపట్టాలని, దీనివల్ల కాలుష్య నివారణ సాధ్యపడుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గ్రీన్ ఆంధ్రప్రదేశ్, గ్రీన్ ఎర్త్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద శుక్రవారం గోపాలపురం పంచాయతీ పరిధిలోని కుమ్మరకుంటలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం వల్ల శబ్ద, వాయువ్య కాలుష్యాల నివారణతో పాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్ ఎంపీపీ వంగా నారాయణమ్మ, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలపురం కుమ్మరకుంటలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ముంపు నీటిని బయటకు పంపండి



కొవ్వూరు మండలం పశివేదల పొలంబడిలో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు



తాళ్లపూడి మండలంలో నీట మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న ఏవో రుచిత

- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన
- రెండు గ్రామాల్లో పొలం బడి

కొవ్వూరు: భారీ వర్షాలు కురుస్తున్నందున వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా రైతులు బయటకు పంపించే ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని దొమ్మేరు, పశివేదల గ్రామాల్లో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఏరువాక కేంద్రం రాజమహేంద్రవరం కో-ఆర్డినేటర్ ఎస్.నందకిషోర్, మార్టేరు ప్రాంతీయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త (మృత్తిక విభాగం) సీహెచ్ శ్రీనివాస్‌లు రెండు గ్రామాల్లోనూ పర్యటించారు. వర్షాల ప్రభావం వల్ల ప్రధానంగా వరి వరిపైరుకు పొడతెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందని వారన్నారు. నాటిన 30-35 రోజుల్లో ఈ వ్యాధి నివారణకు హెక్సాకోనాజోల్ రెండు మిల్లీమీటర్లు లేదంటే వాలిడా మైసిన్ రెండు మిల్లీమీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి వరి పైరుపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఎరువులు వేసిన తర్వాత వర్షాలు కురిస్తే ఎరువులు కొట్టుకు పోయే అవకాశం ఉందన్నారు. అందుచేత ఎకరానికి 20 కిలోల యూరియా, పది కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. పొటాష్ ఎరువులను విధిగా వాడాలని సూచించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు జవాబు లు ఇచ్చారు. కొత్త విత్తనాలు, పురుగు మందులు,తెగుళ్ల నివారణ పద్ధతుల గురించి వారు వివరించారు. వివిధ రకాల కలుపు నాశినులు, ఎరువుల వాడకం గురించి రైతుల సందేశాలను నివృత్తి చేశారు. ఏవో ఎ.గంగాధర్, పరిమి సోమరాజు, గారపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన

తాళ్లపూడి: మండలంలోని వర్షాలకు ముంపు బారిన పడిన వరి చేలను మండల వ్యవసాయాధికారి జి.రుచిత శుక్రవారం పరిశీలించారు. తిరుగుడుమెట్ట, పోచవరం తదితర గ్రామాల్లో మునిగిన వరి చేలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏవో రుచిత మాట్లాడుతూ పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు కూడా ఉన్నారు.

సర్వీసు రిజిస్టర్ల సమస్యపై ‘స్పందన’లో ఫిర్యాదు

నల్లజర్ల: తమ సర్వీసు రిజిస్టర్లు విద్యాశాఖకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్న మండలంలోని పోతవరం వివేకానంద ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యంపై జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో నిర్వహించిన స్పందనలో ముగ్గురు ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన కొండ్రెడ్డి సుగుణకుమారి, వల్లభనేని సుజాత, గమిడి నాగేశ్వరరావు అనే ముగ్గురు ఉపాధ్యాయులు లోగడ వివేకానంద ఎయిడెడ్ స్కూల్లో పనిచేశారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో ఆ ఎయిడెడ్ స్కూల్‌ను విలీనం చేశారు. ఆ ముగ్గురి ఉపాధ్యాయులకూ ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగులు ఇచ్చారు. అయితే ఆ ముగ్గురి సర్వీసు రిజిస్టర్లు ఇవ్వకుండా సంబంధిత యాజమాన్యం తాత్సారం చేస్తోంది. దాంతో వారి జీతాలు నిలిచిపోయాయి. దీనిపై ఆ ముగ్గురూ శుక్రవారం రాజమహేంద్రవరం వెళ్లి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై రాజమహేంద్రవరం డీఎస్పీ వివరాలు తీసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ కొవ్వూరు డీఎస్పీకి ఆదేశాలు జారీ చేసినట్టు ముగ్గురు ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రతి గడపలోనూ సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- కాల్దారిలో గడప గడపకూ..

ఉండ్రాజవరం: రాష్ట్రంలో అమలవుతున్న నవరత్న సంక్షేమ పథకాలతో ప్రతి గడప గడపలోనూ సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని కాల్దారి గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో ఆయన గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో నూతనంగా మంజూరైన 18 రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఆయన ఆందజేశారు. గ్రామంలో నూతనంగా రూ.11 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లకు, రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ డ్రైన్లకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, వైస్ ఎంపీపీ చెట్టి నవీన్, సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, పార్టీ నాయకులు ఏవీవీ సత్యనారాయణ, గుణ్ణం రవికుమార్, సాధనాల ఉమ, రేలంగి నాగేశ్వరరావు, మద్దిపాటి రామ సుబ్బారావు, నిచ్చెనకోళ్ల శ్రీను, చెట్టే ఇసాక్, మేకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కాల్దారి వాసులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

దొమ్మేరు పంచాయతీని విభజించవద్దు

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు పంచాయతీని విభజించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని ఆ పంచాయతీకి చెందిన టీడీపీ, వైఎస్సార్ సీపీల ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. దొమ్మేరు సావరాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్న యోచన సరికాదని వారు శుక్రవారం స్పష్టం చేశారు. దొమ్మేరు పంచాయతీ నుంచి సావరాన్ని విడదీసే ప్రతి పాదనను తామంతా వ్యతిరేకిస్తున్నట్టు తెలియజేస్తూ దొమ్మేరు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సర్పంచ్ తానేటి కుమారి, కార్యదర్శి బాల సుబ్బలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు యలమర్తి రాంబాబు, వాడవెల్లి సూరిబాబు, ఆళపు సరోజిని, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గారపాటి శ్రీదేవి, కలగర వెంకట్రావు, గారపాటి రామకృష్ణ, కొక్కిరిపాటి శ్రీహరి, కేవీకే రంగారావు, ఆకుమూరి సూర్యారావు, వాడవెల్లి రామచంద్రరావు, గుడా సందీప్, సిద్ధగాని వెంకట్రావు, పాలకుర్తి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



దొమ్మేరు సర్పంచ్‌కు వినతి పత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మణిపూర్ ఘటనపై న్యాయవాదుల నిరసన

నిడదవోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, సంఘ పరివార్ తమ రహస్య అజెండా అమలులో భాగంగానే మణిపూర్ మారణహోమం చోటు చేసుకుందని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు జువ్వల రాంబాబు విమర్శించారు. మణిపూర్ మారణ హోమానికి నిరసనగా నిడదవోలు కోర్టు న్యాయవాదులు శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు నిరసన తెలిపారు. మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మత్తి అర్జునుడు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సీహెచ్ విజయకుమార్ మాట్లాడుతూ మూడు నెలలుగా సాగుతున్న మణిపూర్ మారణహోమంలో వందలాది అభాగ్యులు బీజేపీ, ఆరెస్సెస్ మతోన్మాద శక్తుల చేతుల్లో మరణించారని ఆరోపించారు. ఇంత దారుణం జరుగుతున్నా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నోరు మెదపకపోవడాన్ని చూస్తుంటే వారి ప్రమేయంతోనే అల్లర్లు జరిగినట్లు జనం భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఈ. మహేష్, మంగయ్య, ఎ.రవి, గాబ్రియేల్ చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, ఉల్లూరి సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మణిపూర్ ముఖ్యమంత్రితో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ చైర్మన్ ఈ.దయమణి డిమాండ్ చేశారు. మణిపూర్ మారణ హోమానికి వ్యతిరేకంగా ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో దయామణితో పాటు కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్నారి హేమలత, జ్యోతి, దుర్గదేవి, రాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై చిక్కాలలో అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారి

చాగల్లు: గ్రామ, వ్యక్తిగత పరిశుభ్రతలపై మండలంలోని చిక్కాల గ్రామస్తులకు శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నల్లూరి అప్పారావు అవగాహన కల్పించారు. ఆ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎక్కడి పడితే అక్కడ చెత్త వేయరాదని, డంపింగ్ యార్డ్ వద్దకు తరలించేలా చూడాలని కోరారు. గ్రామం పరిశుభ్రంగా ఉండటానికి గ్రామస్తులు ప్రతి ఒక్కరూ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కొయ్యే మణి, సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, ఏఈ అజయ్ బాబు, ఈవో పి ఆర్‌డీ శ్రవణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే కాసిం, అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆశ వర్కర్స్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ గుడిలో తులాభారం

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ ఆలయంలో ఇద్దరు చిన్నారులను శుక్రవారం పటిక బెల్లంతో తులాభారం వేసి కుటుంబ సభ్యులు మొక్కు తీర్చుకున్నారు. దేవరపల్లికి చెందిన తీగల నవీన్ కుమార్, లక్ష్మిసుజాత దంపతుల కుమార్తె సుస్మిత, తుమ్మూరి కల్యాణ చక్రవర్తి, బాలదుర్గ దంపతుల కుమార్తె లలిత ఆదిత్యను పటిక బెల్లంతో తులాభారం వేశారు. ముందుగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, గారపాటి అప్పారావు, భక్తులు పాల్గొన్నారు.

కళ్ల కలకలం

నల్లజర్ల: మండలంలో వారం రోజులుగా కళ్ల కలక వ్యాధి ప్రబలింది. ఈ వ్యాధిబారిన పడిన వారు కళ్లు ఎర్రబారడం, నీళ్లు కారడం, రాత్రిపూట పుసులు కట్టడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు.కళ్లకలక వ్యాధి ఎక్కువగా ఉండడంతో బాగా పరిచయం ఉన్నవారు ఎదురైనా ముఖంలో ముఖం పెట్టి మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వద్దకు, మందుల షాపుల వద్దకు ఈ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఆసుపత్రులకు దూరంగా ఉన్న వారు స్వీయ చికిత్సతో బయట పడుతున్నారు. చిన్నారులు, విద్యార్థుల్లో ఈ కేసులు ఎక్కువగా ఉంటున్నాయని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు తెలిపారు. ఇది అంటువ్యాధి అని, వస్తే 10 రోజుల పాటు ఉంటుందంటున్నారు. అధిక వర్షాలు, వాతావరణంలో వస్తున్న మార్పులే వ్యాధి ప్రబలడానికి కారణం అంటున్నారు. కళ్ల కలక వచ్చిన వారు కుటుంబ సభ్యులతో కలవకుండా వేరుగా ఉండాలన్నారు.లూబ్రి కేటింగ్ ఐడ్రాప్స్, యాంటీ ఎలర్జిక్ మందులు వాడాలన్నారు. కంటిని తరచూ చల్లటి నీటితో కడుక్కోవాలని, చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ గంగాధరరావు సూచించారు.

ముళ్లపూడికి నివాళి

ఉండ్రాజవరం: తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 102వ జయంతిని మండలంలోని తాడిపర్రు గ్రామంలో శుక్రవారం రైతులు, షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

మహిళ ఆత్మహత్య

కంబాలచెరువు: పిల్లలు లేరనే మనస్తాపంతో టి.నగర్‌కు చెందిన యర్రా శివప్రసాద్ (44) అనే వివాహిత శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు నగరానికి చెందిన ధనరాజుతో 25 ఏళ్ల క్రితం పెళ్లయ్యింది. అయితే వీరికి పిల్లలు కలగలేదు. ఇదిలా వుండగా వారం రోజుల క్రితం తమ బంధువుల ఇంటిలో జరిగిన సీమంతం వేడుకకు వెళ్లి వచ్చింది. ధనరాజు గ్యాస్ సిలెండర్లు డెలివరీ చేసే పనికి వెళ్లి తిరిగి శుక్రవారం మధ్యాహం ఇంటికి వచ్చేసరికి ఆమె ఉరివేసుకుని వేలాడుతూ ఉంది. విషయం తెలిసిన రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.